క్లుప్తంగా

వీర్లదిన్నెలో నేటి నుంచి ధార్మిక ప్రవచనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కౌతాళం: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వీర్లదిన్నె గ్రామంలో మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు వీర్లదిన్నెలో కరపత్రాలను విడుదల చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, కందుస్వామి, లింగన్న, రాఘవ, వీరేష్, బుసప్ప, ఈరన్న, ప్రహ్లాదరెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఈరన్నస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పూజలందుకుంటున్న స్వామివారు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాస ఉత్సవాల అనంతరం మొదటి సోమవారం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేపట్టారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఉపాధ్యాయుడు సరోదే వెంకోబరావును సన్మానించిన గ్రామపెద్దలు

ఆదోని రూరల్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విరుపాపురం ఎంపీ(డీపీఈపీ) స్కూల్ ఉపాధ్యాయుడు సరోదే వెంకోబరావును సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ ప్రహ్లాద ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉప సర్పంచ్ వసంతయాదవ్, అంగన్‌వాడీ టీచర్‌లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న అరుణ్ జ్యోతినగర్ వాసులు

ఆదోని రూరల్: పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు హెబ్బటం జి.రాజు మాదిగ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతి పత్రం అందించారు. హెబ్బటం జి.రాజు మాట్లాడుతూ కాలనీలో మూడు సంవత్సరాలుగా మహిళలకు మరుగుదొడ్లు లేవని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు వెంకటేష్, ఈరన్న, లక్ష్మన్న, రామంజి, అశోక్, సురేష్, తిలక్, రాజు పాల్గొన్నారు.

28న కవయిత్రుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నగర శివారు ఆర్టీసీ కాలనీలోని గణేష్ సాహితీ సదన్‌లో 7వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. సావిత్రిబాయి పూలే పేరుతో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 17వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 94402 28999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ముందే తెలిసినా అప్రమత్తం చేయడంలో విఫలం

కౌతాళం: భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలం అయ్యిందని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, వరదలు వచ్చే సమయంలో వాతావరణశాఖ నీటిపారుదల శాల వారు ముందస్తు సమాచారం ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వానికి ముందస్తు సమాచారం తెలిసినప్పటికీ స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడం, వారిని రక్షిత ప్రదేశాలకు తరలించడంలో పూర్తిగా విఫలంకావడంతోనే విజయవాడకు ఇలాంటి పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేవలం సీఎం చంద్రబాబు ఇల్లు మునగకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి నీళ్లు వదిలారని విమర్శించారు. సహాయక చర్యల్లో పూర్తిగా విఫలం అయిందని, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని కూడా ఖాళీ చేయించలేక పోయిన ఈ ప్రభుత్వంను ఏమనలో తెలియడంలేదన్నారు. వరద వచ్చిన తర్వాత సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నం చేయడంతో 50మంది వరకు చనిపోయారని, దీనికి పూర్తి భాద్యత ప్రభుత్వానిదే అన్నారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం భాదకరం అన్నారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని పరిస్థితి ఉందని, వారం రోజుల పాటు లక్షల మంది నరకయాతన అనుభవించడం బాధాకరమన్నారు. రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఇలాంటి పరిస్థితి నెలకోవడంపై సీఎం సమాధానం చెప్పాలి. ఇకనైన సీఎం అధికారుల్ని వెంట వేసుకుని తిరగడం మానుకుని వరద భాదితుల్ని అన్ని విధాలుగా ఆదుకోనేల చర్యలు చేపట్టాలన్నారు.



వై. బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే, మంత్రాలయం



ఎమ్మిగనూరులో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథుడు



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



భక్తులకు రస్నా పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసాచారి



ఎమ్మిగనూరు దిగువ కాలువలో గణనాథులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వినాయకా..సెలవిక

- ఘనంగా గణేష్ నిమజ్జనం
- వైభవంగా శోభాయాత్ర
- ఉత్సాహంగా చిందులు వేసిన యువత
- మంచినీరు, రస్నాలు అందించి మత సామరస్యాన్ని చాటిన ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం కన్నుల పండుగా జరిగింది. వినాయక ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన మూడో రోజు వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సాంప్రదాయ పండుగను ఆధ్యాత్మికంగా.. ఆహ్లాదంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలో చిన్న,పెద్దసైజు వినాయకులను 300లకి పైగా ప్రతిష్టించారు. అధికారులు ఎల్లెల్సీలో పూజలు చేసి నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు.. భక్తజన హర్షధ్వానాల మధ్య సాయంత్రం నుంచి నిమజ్జనానికి వినాయక విగ్రహాల ఊరేగింపు మొదలైంది. సోమప్ప సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్, ఓంశాంతి సర్కిల్, ఆదోని బైపాస్ సర్కిల్ మీదుగా ఎల్లెల్సీ కాలువ వరకూ ఊరేగించారు. కాలువలో భారీ క్రేన్ల సాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. సోమప్ప సర్కిల్‌లో గణేష్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో చిన్నారుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు శివసర్కిల్‌లో వినాయక మండలి వారు వివిధ ఆకృతులతో పేల్చిన బాణసంచా ఆకట్టుకున్నాయి. స్థానిక మల్లెల గ్రూప్స్, ముస్లింల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద భక్తులకు మంచినీటి పాకెట్లు, రస్నాలు అందించి మతసామరస్యాన్ని చాటుకున్నారు. సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు డీఎస్పీ శ్రీనివాసాచారి, సీఐలు సుదర్శన్‌రెడ్డి, విక్రమసింహా, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ,పోలీసు దోబస్తును చేపట్టారు. ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్‌చంద్ర, మదన్ తదితరులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



కోసిగి మండలం సిద్ధప్ప పాళెం ఎస్సీ కాలనీలో అన్నదాన కార్యక్రమం చేపుడుతున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో గణనాథుల నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం వేకువజామున నుంచి కోసిగిలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణపయ్యలకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై కొలువుంచి ఊరేగింపుగా కడపాళెం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు వెళ్లారు. ఊరేగింపులో భక్తులు, యువకులు డ్యాన్సులు వేసుకుంటూ ముందుకు సాగారు. మాధవరం సమీపంలో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. మరికొందరు పులికనుమ రిజర్వాయర్‌లో గణనాథులను నిమజ్జనం చేపట్టారు. వివిధ గణనాథుల విగ్రహాల వద్ద వేలం పాటలో పలువురు లడ్డూ ప్రసాదం కైవసం చేసుకున్నారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

గోనెగండ్ల : మండల ప్రజలు మూడు రోజుల పాటు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించి మండపాల్లో కొలువుంచిన గణేష్ ప్రతిమలను సోమవారం గంగమ్మ ఒడికి చేర్చారు. స్వామి వారి సన్నిధిలో ఉంచిన పండ్లు, ఫలహారాలు, లడ్డూలు వేలం వేశారు. మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను నిబంధనలు పాటిస్తూ వాహనలలో ఎక్కించుకొని బయలుదేరి సంబరాలు చేసుకుంటూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. గోనెగండ్ల, రాళ్లదొడ్డి, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటేడుదిన్నె, నెరుడుప్పల విగ్రహాలను గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిమజ్జనం చేశారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేడుకగా వినాయక నిమజ్జనం

పెద్దకడబూరు: మండలంలో సోమవారం వినాయక నిమజ్జనాన్ని ప్రజలు వేడుకగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంతో పాటు చిన్నతుంబళం, బసలదొడ్డి, హెచ్.మురవణి, కంబదహాల్, కల్లుకుంట, కంబలదిన్నే గ్రామాలలో ఉదయం వినాయక లడ్డూల వేలం నిర్వహించారు. మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో ఎంపీటీసీ కుటుంబసభ్యులు అత్యధికంగా రూ.32వేలకు గణపతి లడ్డునూ వేలంలో దక్కించుకున్నారు. పెద్దకడబూరులో స్థానిక బస్టాండ్ ఆవరణలో రూ. 21వేలకు మొట్రు ఈరన్న లడ్డునూ దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పొందిన వారు డప్పు వాయిద్యాల నడుమ లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తరలించారు. సాయంత్రం నిమజ్జనంలో భాగంగా పెద్దకడబూరు మండల కేంద్రంలో డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చూపరులను ఆకుట్టుకున్నాయి. ఆదోని ప్రధాన రహదారిలోని ఎల్ఎల్‌సీ కాలువకు తరలించి నమజ్జనం గావించారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

నందవరంలో..

నందవరం : మండలంలో మూడు రోజుల పాటు విశేష పూజలందుకున్న పార్వతీ పుత్రుడు గణేశుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. ఉత్సవాల్లో భాగంగా వినాయకుడి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగాయి. నిమజ్జన వేడుక సందర్భంగా గణపయ్యలకు అంతిమ పూజలు గావించి ప్రత్యేక వాహనాలపై ఊరేగింపులు నిర్వహించారు. యువత సంప్రదాయ నృత్యాలు, రంగులు చల్లుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. పలుచోట్ల గణపయ్య లడ్డూలకు వేలాలు నిర్వహించారు. చిన్నారులు హారతులు పట్టి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. మండలంలోని ముగతి, నందవరం, నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, ఇబ్రహీంపురం, మాచాపురం, హాలహర్వి గ్రామాల్లో వినాయకులను తుంగభద్ర నదిలో నిమజ్జనం కానిచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా నిమజ్జనం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం వైభవంగా కొనసాగింది. గ్రామంలో కొలువైన గణేష్ విగ్రహలను సాయంత్రం 4 గంటలనుంచి యువకుల నృతాలు, మేళతాలు, డప్పువాయిద్యాల నడుమ పూర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుల ఊరేగింపు కార్యక్రమం కొనసాగగా విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి మారుతీమోహన్, గ్రామ పెద్దలు ప్రహల్లదచారి, సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, రాఘువేంద్రశెట్టి, ఆధ్వర్యంలో గణనాథులకు ప్రత్యేక పూజలను చేయించి నిమజ్జన కార్యక్రమాలకు చేపట్టారు. గణనాతులను తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, డిప్యూటి తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఎంపీడీఓ సుబ్బారాజులు పర్యవేక్షించారు.

వినాయక మండపం వద్ద అన్నదానం

ఆదోని రూరల్: మండలంలోని మండిగిరి మేజర్ గ్రామ పంచాయతీలోని భరత్ నగర్‌లో బాలబ్రహ్మ వినాయక మిత్రమండలి వారి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వినాయకుడి మండపం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. దాదాపు 2 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాల వీరేష్, ఈశ్వర్, మధు, నాగేంద్ర, నాగచైతన్య, రామ్‌చరణ్, సలీం, షేక్షావలి, రాజు, చిన్నా, మాధవరెడ్డి పాల్గొన్నారు.



గోనెగండ్లలో నిమజ్జనానికి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



పెద్దకడబూరులో వినాయక లడ్డూను దక్కించుకున్న భక్తుడు



పెద్దకడబూరు మండల కేంద్రంలో నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడు



పెద్దకడబూరులో ఉత్సాహంగా చిందులు వేస్తున్న యువత



కోసిగి మార్కండేయ స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం కైవసం చేసుకున్న దంపతులు



కోసిగిలో కలశాలతో గణనాథుని ఊరేగింపు ముందు సాగుతున్న మహిళలు



కౌతాళంలో జెండా ఊపి ఊరేగింపును ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు



ఎమ్మిగనూరులో బాణసంచా కాలుస్తున్న దృశ్యం



నందవరంలో నిమజ్జనానికి వెళ్తున్న గణపయ్య

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డీఎల్‌పీవో నూర్జహాన్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావుపాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతివ్వండి

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, వ్యవసాయ రంగాల్లో ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందిస్తున్న సూచికలో పురోగతి సాధించి గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆదోని మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, వీటిపై విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకముందు ఆదోని తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూమ్, వీఆర్వో, ఎలక్షన రూమ్, ప్రతి గదిని తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంపీడీఓ గీతావాణి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సెబ్ కార్యాలయ అవరణలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై కర్ణాటక మద్యం తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన శివ, మజ్జిగ అయ్యలను అరెస్ట్ చేసి, వారి నుంచి 192 ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, పాష్యన్ ప్రో బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో నుంచి సోగనూరు రోడ్డులో ఉన్న జెడ్పీ స్కూల్ సమీపంలోని ముళ్లపొదల్లో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యంను పట్టుకున్నామన్నారు. ఎస్టీఆర్ కాలనీకి చెందిన దత్తాత్రయ అరెస్ట్ చేసి 288 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డిలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రెండు కేసుల్లో పట్టుబడిన మద్యం విలువ రూ. 80,000 ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో చెక్ పోస్ట్ ఇన్‌చార్జ్ ఈఎస్ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు లింగప్రసాద్, గోపాల్, సెబ్ కానిస్టేబుల్స్ భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యంను మీడియాకు చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

438 మంది గర్భిణులకు స్కానింగ్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు వచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. వారికి సరిపడ కూర్చీలు లేక అవస్థలు పడుతూ కింద కూర్చున్నారు. 438 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, వైద్యురాలు డాక్టర్ సుజిత తెలిపారు.

ఉరుకుంద హైస్కూల్ హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

ఆదోని రూరల్: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పనిచేయిస్తున్న హెచ్‌ఎం సునీతదేవిని సస్పెండ్ చేయాలని ఆర్‌యూఎస్ఎఫ్ నాయకులు రఘునాథ్, ఆర్‌పీఎస్ఎఫ్ ఆఫ్రిది డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోనిలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కి వినతి పత్రాన్ని అందజేశా రు. వారు మాట్లాడుతూ వారం రోజుల క్రితం పాఠశాల హెచ్‌ఎం.. విద్యార్థులతో పెద్దపెద్ద బండరాళ్లను మోయించడం సిగ్గుచేటన్నారు. కలం పట్టాల్సిన చిన్ని చేతులతో పెద్దపెద్ద బండరాళ్లు మోయించడం అంటే బాధాకరమైన విషయమన్నారు.

చిరుత పులి దాడిలో రెండు మేకలు మృతి



చిరుత దాడిలో మృతి చెందిన మేకలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కొండ శివారు ప్రాంతంలో చిరుత పులుల సంచారం విపరీతంగా పెరిగి పోయింది. సోమవారం కోసిగికి చెందిన వక్రాని దస్తగిరికి చెందిన చెందిన గొర్రెల మందును తిమ్మ కొండ శివారు ప్రాంతంలో మేపుతున్నాడు. అయితే సోమవారం సాయంత్రం దస్తగిరికి చెందిన రెండు మేకలను చిరుతపులి గొంతు పటి రక్తం పీల్చి చంపేసింది. దాదాపు మూడేళ్ల పైగా కోసిగి శివారు ప్రాంతంలో చిరుతల సంచార విపరీతరంగా పెరిగిపోయిందని, రాత్రిల్లో నిద్ర లేక చాల అవస్థలు పడుతున్నామని గొర్రె కాపరులు వాపోయారు. ఇప్పటి వరకు 8కి పైగా గొర్రెలను చంపేసిందని బాధితుడు వాపోయాడు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతలను బంధించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం కావాలి

ఆదోని టౌన్: వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు రాజ్యాధికారం కావాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రాయలసీమలో దళిత బహుజనుల రాజ్యాధికారం కావాలని, నీరు, నిధులు, నియామకాలు, ప్రాజెక్టులను యుద్ద ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆదోని ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయాలన్నారు. వీటిపై నిరంతరం ప్రభుత్వంపై పోరాడాలని తీర్మానం చేశారు. సమావేశంలో నాయకులు ప్రకాష్ మల్లేశ్వరప్ప, ప్రసాద్, దీపక్, నల్లారెడ్డి, సంజీవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.